ANN తెలుగు

Follow: @ANNTELUGU

24-02-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 57 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




ప్రత్యేక కథనం 4లో

## టాప్ న్యూస్



**నడిగడ్డ నుంచే కొత్త పార్టీ పెడ్తా...**

- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తా
- కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన

02



**క్రికెట్ మ్యాచ్ చూస్తానంటే...**

- జగన్‌కూ టికెట్ తీసుకుంటా
- ఏపీ మంత్రి నారా లోకేశ్

02



**ఏపీలో అడుగుపెడితే తన్ని తరిమేస్తాం**

- బీఆర్ఎస్ పై ఏపీ మంత్రి సుభాష్ తీవ్ర వ్యాఖ్యలు

02



### వివాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న
# కేయూ క్యాంటీన్

**చికెన్ కోసం తలలు పగలగొట్టుకున్న విద్యార్థులు**

**హన్మకొండ మహా;**హన్మకొండ జిల్లా లోని కాకతీయ విశ్వవిద్యాలయం లోని క్యాంటీన్లో ఆదివారం చికెన్ పంపకాల్లో తలెత్తిన గొడవలు కాస్త విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీసిన ఘటన ఆలస్యంగా వెలులోకి వచ్చింది. హాస్టల్‌లో లంచ్ తర్వాత మిగిలిన చికెన్ ను పంచుకోవడంలో గొడవ మొదలై విద్యార్థులు గుంపులుగా చేరి విచక్షణారహితంగా కర్రలతో కొట్టుకున్నారు.వీరిలో ఎంబీఏ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు, ఎకనామిక్స్ ఫస్ట్ ఇయర్ విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకుందని సమాచారం. ఈ వీడియోలు సోమవారం ప్రచార మాధ్యమాలలో చక్కర్లు కొడుతున్నాయి. వీటిని చూసిన నెటిజన్లు చదువుతున్న విద్యార్థులే విచక్షణ కోల్పోవడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### తెలంగాణ ఇంటర్ పరీక్షలకు
# సర్వం సిద్ధం

**రేపటి నుంచే వార్షిక పరీక్షలు**

**మహా:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేసింది. ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలు మార్చి 18 వరకు నిరంతరాయంగా కొనసాగనున్నాయి. మొదటి మరియు రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులందరికీ థియరీ పరీక్షలను నిర్వహించేందుకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఇప్పటికే జిల్లా యంత్రాంగాలతో సమన్వయం చేసుకుంటూ భారీ ఏర్పాట్లు చేసింది. పరీక్షల సమయానికి సంబంధించి అధికారులు కఠిన నిబంధనలను అమలు చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకే పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతుంది. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య భారీగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9,97,075 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు సిద్ధమయ్యారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,495 పరీక్షా కేంద్రాలను బోర్డు కేటాయించింది.

### ప్రభుత్వ ఉద్యోగులకు
# కేబినెట్ వరాలు

## క్యాష్ లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్‌కు ఆమోదం

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.1.2కోట్ల ప్రమాదబీమా

మెట్రో పూర్తిస్థాయి స్వాధీనానికి ఆమోదం.. రెండో విడత త్వరగా ప్రారంభించాలని నిర్ణయం

మంజీరా ప్రాజెక్టు ఆధునీకరణకు గ్రీన్ సిగ్నల్.. హెచ్ఎండీఏలోకి మరో నాలుగు గ్రామాలు

సీఎం రేవంత్ అధ్యక్షతన ఐదుగంటలకు పైగా కేబినెట్ భేటీ.. వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మార్చి 16 నుండి అసెంబ్లీ సమావేశాలు.. అంతకుముందు ఎన్నికల నిర్వహణపై చర్చ

**హైదరాబాద్. మహా:** రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులపై వరాలు కురిపించారు. ఉద్యోగులు ఎంతోకాలంగా కోరుకున్న వాటికి కేబినెట్ ఆమోదం పలికింది. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం.. భద్రతకు రాష్ట్ర మంత్రి వర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశంలోనే ఆదర్శవంతమైన కొత్త పథకాలు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు జరిగిన మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తి భద్రత, భరోసా కల్పించేందుకు రెండు కొత్త పథకాలను ప్రారంభిస్తుంది. మొదటిది.. ఉద్యోగుల ప్రమాద బీమా పథకం కాగా, దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు అందరికి, పెన్షనర్లకు ప్రమాద బీమా పథకం అమలు చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు. సమావేశంతో మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఉద్యోగులు ఒక్క రూపాయి ప్రీమియం కూడా చెల్లించకుండా ఈ పథకాన్ని అమలు చేస్తుంది. ప్రభుత్వం తొలిసారిగా సింగరేణిలో, ట్రాన్స్ కోలో ఉద్యోగ వర్గాలకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అక్కడ విజయవంతంగా అమలు చేసిందన్నారు. ఇప్పుడు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు అందరికి ఈ పథకాన్ని ప్రారంభిస్తుందన్నారు. ఈ ప్రమాద బీమా అమలుతో ఒకవేళ ఎవరైనా ప్రమాదం లో మరణిస్తే రూ.1.2 కోట్లు ప్రమాద బీమా పరిహారం అందుతుంది. సహజ మరణానికి 60 ఏళ్ల వరకు ఉద్యోగులకు రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ కార్పొరేషన్లు. ప్రభుత్వ రంగ సంస్థల పరిధిలో 5 లక్షల 19 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులున్నారు. వీరితో పాటు 2 లక్షల 38 వేల మంది పెన్షనర్లు ఉన్నారు.

మిగతా 2లో



### క్యాష్ లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్

దీర్ఘకాలికంగా ప్రభుత్వ ఉద్యోగుల ఎదురుచూస్తున్న మరో కోరికను రాష్ట్ర కేబినెట్ ఈ రోజు నెరవేర్చింది. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు క్యాష్ లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. 3 లక్షల 56 వేల మంది ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులతో పాటు 2.88 లక్షల మంది పెన్షనర్లు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు మొత్తం 17.07 లక్షల మందికి ఈ పథకం వర్తిస్తుంది. ఇకపై ప్రభుత్వ ఉద్యోగులు ఆసుపత్రుల్లో ఒక్క రూపాయి చెల్లించకుండానే వైద్య చికిత్సలు అందుతాయి. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 652 ఎంప్యానెల్ ప్రైవేట్ హాస్పిటల్స్ లో ఈ పథకం వర్తిస్తుంది. దీనిపై మొత్తం 1998 వైద్య చికిత్సలు అందిస్తారు. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ ఎంప్లాయీ కార్డ్ అందిస్తారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ఈ ఉచిత నాణ్యమైన వైద్యం అందించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ పథకానికి ప్రభుత్వ ఉద్యోగులు తమ బేసిక్ పే నుంచి 1.5 శాతం తమ వాటాగా చెల్లిస్తారు. అంతే సమాన వాటాను ప్రభుత్వం మ్యాచింగ్ వాటా చెల్లిస్తుంది. ఏడాదికి ఉద్యోగులు రూ. 528 కోట్లు తమ వాటాగా చెల్లిస్తే.. ప్రభుత్వం కూడా రూ. 528 కోట్లు వాటా చెల్లిస్తుంది. మొత్తం రూ.1056 కోట్ల తో క్యాష్ లెస్ ఎంప్లాయి హెల్త్ స్కీమ్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# ఏపీలో కల్తీ కలకలం

## కల్తీ పాలు తాగి నలుగురు మృతి

ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటన

రాజమండ్రి ఘటనపై చంద్రబాబు సీరియస్

నరసాపురం వరలక్ష్మి డెయిరీ నుంచి పాల సరఫరా

కల్తీపాల ఘటనపై జగన్ దిగ్భ్రాంతి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

లడ్డూ కల్తీపై నేడు అసెంబ్లీ లో చర్చ.. ఏపీ కౌన్సిల్ లో రచ్చ మరోవైపు



**అమరావతి, మహా :** తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో కల్తీ పాలు కలకలం సృష్టించాయి. కల్తీ పాలు తాగిన కారణంగా రెండు కాలనీల ప్రజలు తీవ్ర అనారోగ్యం బారిన పడి నలుగురు మృతిచెందడం భయాందోళనలకు గురిచేసింది. రాజమండ్రి పరిధిలోని చౌడేశ్వరి నగర్ , వెంకటేశ్వర నగర్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం పాలు తాగిన కొద్దిసేపటికే చాలామంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో బాధితులు విలవిలలాడారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఒక్కొక్కరిగా అనారోగ్యం బారిన పడటంతో పరిస్థితి విషమంగా మారింది. కల్తీ పాలు తాగి చనిపోయిన వారికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతులకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల పరిహారం ప్రకటించింది. మొత్తం 12 మందికి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. వీరిలో ఇద్దరి వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మరోవైపు సీఎం చంద్రబాబు సైతం అసెంబ్లీలో పరిహారంపై స్పష్టత ఇచ్చారు.

**రాజమండ్రి ఘటనపై ప్రభుత్వం సీరియస్**

రాజమండ్రి ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. నరసాపురం వరలక్ష్మి డెయిరీ నుంచి పాల సరఫరా చేసినట్లు గుర్తించింది. పాల నమూనాలను హైదరాబాద్‌కు పంపింది. కల్తీ నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. పాల వ్యాపారి నాగేశ్వరరావును పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. కల్తీ పాలు తాగి నలుగురు చనిపోవడం బాధాకరమన్నారు.

మిగతా 2లో

## ర్యాపిడో బైక్ ను ఢీకొన్న వాటర్ ట్యాంకర్

**బంజారాహిల్స్ లో దారుణం.. ర్యాపిడో డ్రైవర్, బుక్ చేసుకున్న యువతి మృతి**



**బంజారాహిల్స్, మహా :** బంజారా హిల్స్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వాటర్ ట్యాంకర్ ర్యాపిడో బైకును ఢీకొన్న ఘటనలో హోమ్ గార్డు సహా ఓ యువతి మృతి చెందారు. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1లో జరిగిన ఈ ప్రమాదంలో పార్ట్ టైం ర్యాపిడో డ్రైవర్ గా పని చేస్తున్న ఓ హోంగార్డ్, ర్యాపిడో బైక్ బుక్ చేసుకున్న యువతి మృతి చెందారు.

మిగతా 2లో

# పెళ్లి పేరుతో హనీట్రాప్

## అమ్మాయిలూ.. జర భద్రం

బ్లాక్ మెయిల్స్ పట్ల యువతులు అప్రమత్తంగా ఉండాలి

ధైర్యంగా షీ టీమ్స్ కు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ సూచన

**హైదరాబాద్, మహా:** పెళ్లి ముసుగులో యువతులను మోసగిస్తూ, బ్లాక్ మెయిల్ కు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఎక్స్ వేదికగా హెచ్చరించారు. కేవలం ప్రేమ వ్యవహారాల్లోనే కాకుండా, పెద్దలు కుదిర్చిన సంబంధాల మాటున కూడా నిశ్చితార్థం తర్వాత యువతులకు మాయ మాటలు చెప్పి లొంగదీసుకోవడం, ఆపై అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న ఘటనలపై ఇటీవల హైదరాబాద్ షీ టీమ్స్ కు ఫిర్యాదులు అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యువతులు, వారి తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

**మోసం సాగుతోందిలా...**

ముందుగా పక్కా ప్రణాళికతో, సంప్రదాయబద్ధంగా పెళ్లి చూపులు, ఆపై ఘనంగా నిశ్చితార్థం చేసు



కుంటున్నారు. 'ఇక పెళ్లి ఖాయమైంది కదా' అనే చనువుతో యువతులకు దగ్గరవుతున్నారు. 'ఎలాగూ పెళ్ళే కదా.. ఇప్పుడైతే ఏంటి?' అని మాయమాటలు చెబుతూ, ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేస్తూ

మిగతా 2లో

# తెలంగాణలో వడగళ్ల వాన బీభత్సం

## పంటలకు తీవ్ర నష్టం.. హైదరాబాద్ లోనూ భారీ వర్షం

**హైదరాబాద్, మహా :**రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం అకస్మాత్తుగా భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది. ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలిపోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు



విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు.

**హైదరాబాద్ సిటీలో భారీ వర్షం**

హైదరాబాద్ సిటీలో వర్షం కురిసింది. చిరు జల్లులు భాగ్య నగరాన్ని చాలా రోజుల తర్వాత పలకరించాయి. అబిడ్స్, బషీర్ బాగ్, సైఫాబాద్, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. మీర్ పేట్, బడంగ్ పేట్ పరిసర ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఎల్బీ నగర్, మలక్ పేట్, సరూర్ నగర్, చార్మినార్, బీఎన్ రెడ్డి, ఉప్పల్, నాగోల్, అంబర్ పేట్, వనస్థలిపురం, హయత్ నగర్ ప్రాంతాల్లో ఈదురు గాలులు వీచాయి.

### విదేశాల్లో బ్యాంకుల కొనుగోలు వల్లే
# బంగారం రేట్ల పెరుగుదల

**వృద్ధి పథంలో భారత్.. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్**

**ఢిల్లీ, మహా :** బంగారం ధరల పెరుగుదలపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. సోమవారం ఆర్బీఐ సెంట్రల్ బోర్డు మీటింగ్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పలు దేశాల కేంద్ర బ్యాంకులు బంగారాన్ని భారీగా కొంటున్నాయి. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్ల వల్లే బంగారం ధరలు పెరిగిపోతున్నాయి. బంగారం, వెండి దిగుమతుల గురించి ఆందోళన పడాల్సిన అవసరం లేదు. వాటిని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని పేర్కొన్నారు. బ్యాంకులు తమ కోర్ బిజినెస్‌పై దృష్టిసారించాలని నిర్మలా సీతారామన్ సూచించారు. బీమా ఉత్పత్తులను మిస్ సెల్ చేయొద్దన్నారు. భారత్ వృద్ధి పథంలో పయనిస్తోందని, ఇందులో అందరూ భా



గస్వాములు కావాలన్నారు. పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడులను పెంచాలని కోరారు. భారత్ సహా అన్ని దేశాలపై డొనాల్డ్ ట్రంప్ విధించిన 15 శాతం సుంకాలపై స్పందిస్తూ.. వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని సమీక్షిస్తోందని నిర్మలా సీతారామన్ అన్నారు.

మహా పత్రిక 03
మంగళవారం, హైదరాబాద్ | 24-02-2026
జిల్లా వార్తలు | DISTRICT NEWS
WWW.MAHAADAILY.COM

# హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి..

**డీఎస్పీ రవీందర్ రెడ్డి**



**మణుగూరు, మహా :** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మణుగూరు ఉపరితల గనిలో ఆఫ్ లోడింగ్ పనులు నిర్వహిస్తున్న గౌరవ్ ఓబీ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సోమవారం మణుగూరు పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇంటి నుంచి బయలుదేరిన వెంటనే హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. డ్యూటీకి వెళ్లే సమయంలోనూ, తిరిగి వస్తున్న సమయంలోనూ కార్మికులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని, హెల్మెట్ ప్రాణరక్షక కవచమని తెలిపారు. కార్మికులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ.. రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ నాగబాబు, ఎస్ఐ శ్రావణ్ కుమార్, భాగం సతీష్, పుచ్చకాయల రవి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కార్మికులు హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# కారేపల్లి ఐకేపీలో రూ.3 కోట్ల మొండిబకాయిలు

**మొట్లగూడెం అక్రమంపై ప్రారంభమైన విచారణ.. మహా కథనాలతో విచారణకు కదిలిన యంత్రాంగం**



మొట్లగూడెం అక్రమంపై ప్రారంభమైన విచారణ

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండల ఐకేపీ లో మూడు కోట్ల రూపాయలకు పైబడి మొండి బకాయిలు పేరుకుపోయాయి. మండలంలోని 60 గ్రామ సమాఖ్యల పరిధిలో స్వయం సహాయక సంఘాలకు 8 కోట్ల రూపాయల కు పైబడి వివిధ రకాల రుణాలు బ్యాంకుల నుండి ఇవ్వగా మూడు కోట్లకు పైబడి మొండి బకాయిలు ఉన్నాయి. జిల్లాలోనే అతి తక్కువ శాతం రికవరీ ఉండడంతో జిల్లా యంత్రాంగం ఈ మండలం పై దృష్టి సారించింది. రూ. 80657671 లోన్లు ఇవ్వగా రూ.33693601 మొండి బకాయిలుగా మిగిలిపోయాయి. వీటి రికవరీ కోసం ఆర్ఆర్ యాక్టు తో ఆఫీసర్లు జప్తులకు సిద్ధమవుతు న్నారని సమాచారం.

**అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి...**

మండల వ్యాప్తంగా ఉన్న మొండి బకాయిలలో కోటిన్నర దాకా కొందరు అధికారులు కొందరు గ్రామ దీపికలు కలసి కాజేశారని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు లోన్లు మంజూరు చేయించి వారికి నామ మాత్రంగా కొన్ని అప్పగించి భారీగా డబ్బులు కాజేసి మేమే కట్టుకుంటామని నమ్మ బలికిన అక్రమ వ్యవహారం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ అక్రమాల పై మహా వరస పరిశోధనాత్మక కథనాలు ఇవ్వడానికి క్షేత్రస్థాయిలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకున్నాయని విషయాలపై వివరాలు సేకరించే పనులు చేపట్టింది. ఈ క్రమంలో గుమ్మడికాయ దొంగలు అంటే భుజాలు చరుచుకున్నట్లు గా అక్రమార్కులు ఉలిక్కి పడుతూ అది చేస్తాం ఇది చేస్తామని బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారు. రెండు మూడు రోజుల్లో పూర్తి వివరాలతో ఐకేపీ లో అక్రమాలన్నీ గ్రామాల వారీగా వెలుగులోకి వస్తాయి.

**అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి....**

కారేపల్లి మండల వ్యాప్తంగా ఐకేపీలో ఎన్నో అక్రమాలకు పాల్పడిన అక్రమార్కుల గుండెల్లో మహా కథనాలతో గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. చేసిన తప్పులన్నీ బయటపడతాయనే భయంతో నానా రకాల ప్రయత్నాలు మొదలుపెట్టారు. గతంలో వారికున్న రాజకీయ పలుకుబడితో అక్రమాలన్నిటిని బయటికి రానివ్వకుండా తొక్కిపట్టా రు.

ఉత్తుత్తి గ్రూపులతో మండలంలోని మోట్లగూడెం గ్రామంలో జరిగిన 12 లక్షల రూపాయల అక్రమంపై సోమవారం విచారణ ప్రారంభమైంది. ఐకేపీ ఏపిఎం పిడమర్తి వెంకటేశ్వరావు, స్త్రీ నిధి అసిస్టెంట్ మేనేజర్ సైదేశ్ తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకులో బ్యాంక్ మేనేజర్ ను కలిసి వివరాలు సేకరించారు. స్వరాజ్, వినాయక్ గ్రూపుల పేరుతో రుణాలు తీసుకున్న పత్రాల కాపీలను తీసుకునేందుకు మేనేజర్ కు లెటర్ ఇచ్చారు. మరో వైపు గ్రామీణ వికాస్ బ్యాంక్ అధికారులు కూడా ఈ అక్రమ రుణాలపై విచారణ చేపడుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు ఉంటాయని, విచారణ నిర్వహించి పూర్తిస్థాయి నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వరరావు తెలిపారు.

## అక్రమ ఇసుక రవాణాపై

# పోలీసుల దాడి..

**నాలుగు ట్రాక్టర్లు పట్టివేత**

**మహా, దుమ్ముగూడెం:** మండల పరిధిలోని సీతారామపురం గ్రామ చివరలో అక్రమంగా గోదావరి నదిలో నుంచి ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపురం గ్రామ చివర్లో సోమవారం ఉదయం ఐదు గంటలకు సమయంలో ఇసుకలోడు చేసుకుని తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా పాత మారేడుబాక గ్రామానికి చెందిన నాలుగు ట్రాక్టర్లు తో సహా డ్రైవర్లు అక్రమంగా ఇసుక తరలించి అమ్ముకునేందుకు ప్రయత్నించినట్లు అంగీకరించారు.ప్రతి ట్రాక్టర్లో సుమారు నాలుగు టన్నుల ఇసుక ఉందని పంచనామా నమోదు చేసి వాహనాలను ఇంజన్లను పోలీసులు అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. మండలంలోని అక్రమ ఇసుక రవాణాపై చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# టేకులగూడెం వలస ఆదివాసీ గుంపుకు సోలార్ ప్లేట్లు, లైట్లు పంపిణీ

**ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు**



**పినపాక ,మహా:** పినపాక మండల పరిధిలోని టేకులగూడెం గొత్తి కోయ గుంపు కు ఏడుళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్‌నేతృత్వంలో సోలార్ ప్లేట్లు, సోలార్ లైట్లు పంపిణీ చేశారు. సోమవారం ఏడుల్లా బయ్యారం పోలీస్ స్టేషన్ లో సోమవారం వలస ఆదివాసీ గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూగ్రామ ప్రజల ఇళ్లలో విద్యుత్ సౌకర్యం పూర్తిగా అందుబాటులో లేకపోవడంతో ఈ సోలార్ పరికరాలు వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. రాత్రివేళల్లో వెలుతురు కల్పించడం ద్వారా విద్యార్థుల చదువుకు, కుటుంబాల భద్రతకు ఇది తోడ్పడనుందన్నారు.ఈ సందర్భంగా గుత్తికోయా ప్రజలు తమ అవసరాలను గుర్తించి సహాయం అందించిన తెలంగాణ పోలీసు శాఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లప్పుడూ తమకు అండగా నిలుస్తూ సహాయ సహకారాలు అందిస్తున్న పోలీసు సిబ్బందిని వారు అభినందించారు.

# న్యాయవాది సూర్యానికి బార్ అసోసియేషన్ నివాళి...

**కుటుంబానికి రూ.1.01 లక్షల ఆర్థిక సహాయం అందజేత..**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం న్యాయవాది పగిడిపల్లి సూర్యానికి శ్రద్ధాంజలి ఘటించారు. మణుగూరు కోర్టు మీటింగ్ హాల్లో నిర్వహించిన సంతాప సభలో సూర్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ.. న్యాయవాది సూర్యంకు మణుగూరు బార్ అసోసియేషన్‌తో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని స్మరించుకున్నారు. అసోసియేషన్ కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొనడమే కాకుండా, సహచర న్యాయవాదులకు ఎల్లప్పుడూ సహకారం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. న్యాయవృత్తిపట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, వినయశీల స్వభావం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు.అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు సూర్యం స్వగృహానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు రూ.1,01,000 లు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. త్వరలోనే మరికొంత నగదు సహాయం కూడా అందించనున్నట్లు తెలిపారు. సూర్యంకు భార్య సుప్రియ తోపాటు పదవ తరగతి చదువుతున్న సుందర్, ఏడవ తరగతి చదువుతున్న జెన్నీలు ఉన్నారు. పిల్లల చదువుల ఖర్చులకు అవసరమైన సహకారం అందించడమే కాకుండా, ఎప్పుడైనా ఏ అవసరం వచ్చినా అసోసియేషన్‌ను సంప్రదించాలని, తాము ఎల్లవేళలా అండగా ఉంటామని సభ్యులు హామీ ఇచ్చారు.సభలో పలువురు న్యాయవాదులు పాల్గొని సూర్యం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బద్దం శ్రీనివాస్ రెడ్డి, చిర్ర రవికుమార్, న్యాయవాదులు ఎస్ వి రమణ రెడ్డి, బొమ్మ రామకోటయ్య, కె నగేష్ కుమార్, కె విజయ్, మేదరమెట్ల శ్రీనివాస్, జాడి చొక్కాయ, అంకం సర్వేశ్వరరావు, పోశం భాస్కర్, మధుసూదన్, నాగార్జున రెడ్డి, రమేష్, వాసవి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అటవీ అధికారుల భరతం పడతాం..

- ఇసుక ర్యాంపుల కోసం దొంగ పత్రాలు సృష్టి..
- ఆదివాసీ సంఘాలతో ఎఫ్‌డీఓ కార్యాలయం ముట్టడి చేస్తాం..
- కాంగ్రెస్ నాయకులు గురజాల గోపి..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్రమాలకు పాల్పడుతున్న అటవీశాఖ అధికారుల భరతం పడతామని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని రేణుకా చౌదరి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అడవిని దోచుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్న అటవీ అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. గుట్ట మల్లారం వద్ద ఇసుక ర్యాంపుల కోసం పచ్చని వృక్షాలను నరికి, మూడు లారీలు వెళ్లేలా భారీ రోడ్డు నిర్మించారని ఆరోపించారు. గిరిజన గ్రామాలకు రహదారులు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలంటే నిబంధనలు గుర్తుకు వచ్చే అధికారులకు, అక్రమ రోడ్డుల నిర్మాణంలో మాత్రం ఆ నిబంధనలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు.అడవిలో గతంలో రోడ్డు ఉందని దొంగ పత్రాలు సృష్టించి, బడా బాబులతో చేతులు కలిపి భారీ యంత్రాలతో రహదారి నిర్మించారని విమర్శించారు. గతంలో రోడ్డు ఉన్నదని చెబుతున్న అటవీశాఖ అధికారులు బహిరంగంగా ధ్రువపత్రాలు చూపించాలని డిమాండ్ చేశారు. ఇసుక ర్యాంపుల కోసం నిర్మించిన రోడ్డుకు 'జలపాతాలకు రహదారి అని పేరు పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సబ్ డివిజన్లోని మారుమూల వలస ఆదివాసి గ్రామాలైన రాయన్నపేట రేగుల గండి ఖమ్మంతోగు బుగ్గ పెద్దపెల్లి లాంటి గ్రామాలకు అటవీ మార్గాన కనీసం కాలినడకన దారి కూడా ఇవ్వడం లేదని, ఇసుక మాఫియా కు మాత్రం భారీ చెట్లను పెద్దపెద్ద మిషన్లతో తొలగించి మరి రహదారులు నిర్మించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని రిజర్వ్ ఫారెస్ట్ లో అటవీ అధికారులు ఎలా రహదారులు నిర్మిస్తారని ప్రశ్నించారు. రోడ్డు నిర్మాణానికి ఎవరెవరు అనుమతులు ఇచ్చారో ఎఫ్‌డీఓ, ఎఫ్‌ఆర్‌ఓలను ప్రశ్నిస్తే సమాధానం దాటవేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి ఎఫ్‌డీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అటవీ అధికారుల అక్రమాలను ఇప్పటికే రేణుకా చౌదరి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండల అధ్యక్షురాలు పూనం సరోజ, ఎండి షబానా, కోరి శ్యామల, కన్నపురం వసంత, దేరంగుల సుజాత, రెడ్డిబోయిన రేణుక, కన్నపురం శైలజ, లక్కీశెట్టి హేమలత తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం సాధించిన నక్క హాసిని

**10 వేల నగదు ప్రోత్సాహం**



**మహా దుమ్ముగూడెం:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో ఎడిషన్ సీఎం కప్ పోటీలలో దుమ్ముగూడెం మండలం పెద్ద నల్లబల్లి గ్రామానికి చెందిన నక్క హాసిని వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో మూడో స్థానంలో నిలిచింది. సోమవారం హైదరాబాదు ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో 86 కేజీల వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొన్న హాసిని బ్రాంజ్ మెడల్ సాధించి తెలంగాణ ప్రభుత్వం నుండి ప్రకటించిన 10వేల రూపాయల నగదు బహుమతిని గెలుచుకుంది. కొత్తగూడెం సింగరేణి ఉమెన్స్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న హాసిని చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తుంది గతవారం పాల్వంచలో జరిగిన జిల్లాస్థాయి సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలలో ద్వితీయ బహుమతి సాధించిన క్రీడాకారిని నక్క హాసిని మండలానికి చెందిన పలువురు ప్రముఖులు గ్రామస్తులు స్నేహితులు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

# పారిశ్రామిక విద్యతో బంగారు భవిష్యత్..

**మణుగూరు ఐటీఐ ఏటీవో శ్రీనివాసరావు..**



**మణుగూరు, మహా :** పారిశ్రామిక విద్య విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని మణుగూరు ప్రభుత్వ ఐటీఐ ఏటీవో ఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఐటీఐ ఏటీసీ అడ్మిషన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సమితి సింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కె పరమయ్య చేతుల మీదుగా ఏటీసీ పోస్టర్‌ను ఆవిష్కరించారు.అనంతరం పదో తరగతి విద్యార్థులతో సమావేశమై ఐటీఐ ఏటీసీ కోర్సుల వివరాలను తెలియజేశారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఐటీఐలో చేరితే తక్కువ కాలంలోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కోర్సులను ఏటీసీల ద్వారా అందిస్తున్నదని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు.ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి రవి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏటీసీ మాస్టర్ ట్రైనర్ కె పూర్ణచంద్రరావు, చైతన్య భార్గవ్, పాఠశాల ఉపాధ్యాయులు బి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టితో గుంతలు కాదు.. తారుతో రోడ్డు వెయ్యాలి

**కొమరం దామోదర్ రావు**



**మహా దుమ్ముగూడెం :** భద్రాచలం నుండి వాజేడు వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతలను సౌడు మట్టితో పూడ్చడం కాదు.. తారు రోడ్డు తో పటిష్టంగా ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కొమరం దామోదర్ రావు డిమాండ్ చేశారు. దుమ్ముగూడెం మండల లోని ప్రధాన రహదారిపై గుంతలను మట్టితో పోల్చడంపై ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచలం నుంచి వాజేడు వరకు 120 కిలోమీటర్ల ప్రధాన రహదారికి కొత్త రోడ్డు వెయ్యాలని నాలుగు మండలాల ప్రజలు రాజకీయ నాయకులు యువత కోరుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. మట్టితో పోల్చడం వల్ల ఇసుక లారీల వేగంతో ప్రజల ప్రాణాలు ప్రమాదాల తో పాటు మట్టి వల్ల దుమ్ము ధూళితో ఆరోగ్యకరమైన సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. గత కొద్దిరోజులుగా మొలకపాడు సెంటర్లో నిర్వహించిన రాస్తారోకో కార్యక్రమంలో 10 రోజుల్లో రోడ్డు మరమ్మతులు పనులు చేపడతామని తెలిపిన అధికారులు మట్టితో గుంతలు పూడ్చడం ఏంటని మండిపడ్డారు. రహదారి వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

# రోడ్డు భద్రత పై అరైవ్ అలైవ్ కార్యక్రమం



**మహా దుమ్ముగూడెం:** వాహనదారులు రోడ్డు ప్రమాదాలు జరుగకుండా భద్రత నియమాలు తప్పకుండా పాటించాలని దుమ్ముగూడెం సిఐ టి. వెంకటప్పయ్య అన్నారు. భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని పర్ణశాల గ్రామంలో అరైవ్ అలైవ్ సెకండ్ ఫేజ్ అవగాహన కార్యక్రమమును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రమాదాలను నివారించడానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగితే, కుటుంబం పూర్తిగా ఆర్థికంగా కుంగిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలోని వివిధ గ్రామాల ప్రజలు సిబ్బంది పాల్గొన్నారు.

# పర్ణశాల పుణ్యక్షేత్రంను దర్శించుకున్న హాస్య నటుడు



**మహా దుమ్ముగూడెం:** ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారిని హాస్య నటుడు గౌతమ్ రాజు వారి సతీమణి ఝాన్సీరాణి సోమవారం దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదాలను అందించారు అనంతరం ఆలయ ప్రాంగణంలోని సీతమ్మ వారి కుటీర ప్రదేశాలను సందర్శించి విశిష్టతను తెలుసుకున్నారు. అనంతరం దుమ్ముగూడెం గ్రామ దేవత అయినటువంటి ముత్యాలమ్మ తల్లి అమ్మవారిని, లక్ష్మి నగరం గ్రామంలోని దాసాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట దుమ్ముగూడెం మండల తహసిల్దార్ అశోక్ కుమార్ సినీ నిర్మాత పాకాలపాటి విజయవర్మ తదితరులు పాల్గొన్నారు.

# మా దళిత బిడ్డల బతుకులు మారేదేన్నడు

- చర్ల మండలంలోని దళిత కుటుంబాలను ఆదుకోండి డిప్యూటీ సీఎం
- ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కూరపాటి వీర్రాజు



**చర్ల, మహా:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్ల దళితుల బతుకులుకు ఓ దారి చూపండి అని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కూరపాటి వీర్రాజు కోరారు. భద్రాచలం నియోజకవర్గం లోని ఎస్సీ కుటుంబాలు మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని ఆవేదన వెలిబుచ్చారు ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం చర్ల దళితులను ఆదుకొని షెడ్యూల్ కులాల కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పాటుపడాలని కోరారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చర్ల మండలంలోని దళితులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అక్కున చేర్చుకొని చర్ల మండలంలోని దళిత కుటుంబాలకు ప్రతి ఇంటికి ఇందిరమ్మ ఇల్లు , ఎకరం భూమి, అంబేద్కర్ అభయహస్తం నిధులు 12 లక్షల రూపాయలు ప్రతీ కుటుంబానికి ఇవ్వాలని, చర్ల మండలంలోని దళిత కుటుంబాలను ప్రామాణికంగా తీసుకొని రెండు ఇసుక ర్యాంపులను ప్రభుత్వం కేటాయించి దళితుల ఆర్థిక అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## హ్యూమన్ రైట్స్ ఆర్టిఐ విభాగం కన్వీనర్ గా

# అడ్వకేట్ మారపాక రమేష్ కుమార్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టిపిసిసి) లీగల్, హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్టీఐ విభాగం రాష్ట్ర కన్వీనర్ గా కొత్తగూడెం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది మారపాక రమేష్ కుమార్ ను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పొన్నం అశోక్ గౌడ్ మాట్లాడుతూ న్యాయరంగంలో అనుభవం కలిగిన రమేష్ కుమార్ పార్టీ లీగల్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. మానవ హక్కుల పరిరక్షణ బలహీన వర్గాలకు న్యాయ సహాయం అందించడం ఆర్టీఐ హక్కుల పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. మారపాక రమేష్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కొరకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజలకు న్యాయం అందించే దిశగా నిబద్ధతతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు, రాష్ట్ర టీపీసీసీ సెల్ కన్వీనర్ ఆకుల సత్యనారాయణ మూర్తి, రాజ్ కుమార్ పాల్గొనగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీపీసీసీ లీగల్ సెల్ జిల్లా చైర్మన్ వెల్లంకి వెంకటేశ్వరరావు, పడిసిరి శ్రీనివాస్, న్యాయవాదులు యెర్రా కామేష్, అంబటి రమేష్, ఎర్రపాటి కృష్ణ, సమంత్, వడ్లకొండ హరి తదితరులు అభినందనలు తెలిపారు.

## పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

# పకడ్బందీగా నిర్వహించాలి

**కలెక్టర్ జితేష్ పాటిల్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో పబ్లిక్ పరీక్షల నిర్వహణకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్లు డిపార్ట్మెంటల్ అధికారులు కస్టోడియన్లు జాయింట్ కస్టోడియన్లు సిసెంటర్ కస్టోడియన్లు మండల విద్యాశాఖాధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 73 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పరీక్షలకు 12,731 మంది రెగ్యులర్ విద్యార్థులు, 404 మంది ప్రైవేట్ అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడతాయని వెల్లడించారు.విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అత్యంత కీలక అంశం కావడంతో పరీక్షల నిర్వహణలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లు, సెంటర్ సూపరింటెండెంట్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. మండల విద్యాశాఖాధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు తమ పరిధిలోని పరీక్షా కేంద్రాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించి నివేదికలు సమర్పించాలని సూచించారు. గతంలో చోటుచేసుకున్న సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశ్నపత్రాల భద్రత రవాణా భద్రపరిచే విధానం సమయపాలన వంటి అంశాల్లో ఎటువంటి లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 బిఎన్ అమలు చేయడంతో పాటు పోలీస్ శాఖ ద్వారా పర్యవేక్షణను బలోపేతం చేయాలని అన్నారు. కాపీచేసే చర్యలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు పరిశీలక బృందాలను నియమించాలని ఆదేశించారు.విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అనుకూల పరిస్థితులు కల్పించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, సరిపడ ఫర్నిచర్, పరిశుభ్రమైన మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు రైటర్ సౌకర్యం, ర్యాంపులు తదితర అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.అన్ని పరీక్షా విధుల్లో పాల్గొనే అధికారులు సిబ్బంది విధిగా తమ ఐడీ కార్డులను ధరించాలని కలెక్టర్ స్పష్టంగా ఆదేశించారు. ఐడీ కార్డు లేకుండా ఎవరినీ పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతించరాదని ఆదేశించారు.చీఫ్ సూపరింటెండెంట్లు ప్రభుత్వ నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ పరీక్షల నిర్వహణలో పారదర్శకత నిష్పాక్షికత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలలో మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధించబడినవని, నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ శంభు ప్రసాద్, పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ తొలగించాలి:సీపీఎం



**చర్ల, మహా:** చర్ల మండల మేజర్ పంచాయతీ పరిధిలో రాజయ్య నగర్. సాయి నగర్. విజయ కాలనీ. మధ్యలో గల డంపింగ్ యార్డ్ తొలగించాలని సిపిఎం పార్టీ మండల కమిటీ డిమాండ్ చేసింది.ఈ మేరకు సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాసిపిఎం పార్టీ మండల కమిటీ కార్యదర్శి మచ్చ రామారావుమాట్లాడుతూ... 2011 సం నుండి సిపిఎం పార్టీ అధ్వర్యంలో అక్కడ డంపింగ్ యార్డ్ తీసివేయలి అని వినతి పత్రాలు ధర్నాలు చేయటం జరిగింది. నాటి నుంచి అధికారులు నేటి కి కూడా డంపింగ్ యార్డ్ తరలింపు లో ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు . ఈ కార్యక్రమంలోసిపిఎం పార్టీ మండల కమిటీ కార్యదర్శి మచ్చ రామారావు ,సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు పొడుపు గంటి సమ్మక్క. పామలా బాలాజీ .బీ. నవీన్ . నక్క అమ్మాజీ. గద్దం సరిత గద్దం రమాదేవి ఓంటరాం సౌందర్య. ఓంటరాం సౌజన్య కాండీలా పోశలు చినిగిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

ABN తెలుగు
మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్
24-02-2026
మహా ప్రత్యేకం




# హలీం ఘుమఘుమలు

## రంజాన్ వేళ బావర్చీలకు ఫుల్ డిమాండ్.. లక్షల్లో ప్యాకేజీలు

### ఈ జాబ్ ముందు సాఫ్ట్ వేర్ జాబ్ కూడా జుజుబీ.. నిజాంల కాలం నాటి రాజరిక రుచులకు ప్రాణం పోస్తున్న వంటగాళ్లు

**మహా ప్రత్యేకం:**

హైదరాబాద్ సిటీ రంజాన్ మాసపు ఆధ్యాత్మిక శోభతో పాటు, నోరూరించే హలీం ఘుమఘుమలతో నిండిపోయింది. ఎక్కడ చూసినా హలీం బట్టీలు, సందడి చేసే భోజన ప్రియులు కనిపిస్తున్నారు. అయితే, ఈ పసందైన వంటకం వెనుక రేయింబవళ్లు శ్రమిస్తూ, తమ చేతివాటంతో అద్భుతమైన రుచిని అందించే 'ఉస్తాద్'ల (మాస్టర్ చెఫ్) హవా ఇప్పుడు నగరంలో నడుస్తోంది. ప్రస్తుతం నగరంలోని ప్రముఖ హోటళ్లన్నీ ఈ వంటగాళ్ల కోసం పోటీ పడుతున్నాయి.

**లక్షల్లో ప్యాకేజీ.. డిమాండ్ మామూలుగా లేదు!**

హలీం తయారీ అనేది ఒక కళ. దీనికి ఓపికతో పాటు సరైన పాకం తెలిసిన నైపుణ్యం కావాలి. అందుకే రంజాన్ మాసంలో ఈ ఉస్తాద్‌లకు విపరీతమైన గిరాకీ ఉంటుంది. తయారీ పరిమాణం, అనుభవాన్ని బట్టి ఒక్కో మాస్టర్ చెఫ్‌కు నెలకు సుమారు రూ. 2.50 లక్షల నుండి 4లక్షల వరకు ప్యాకేజీలు ఇచ్చేందుకు హోటల్ నిర్వాహకులు వెనకాడటం లేదు. వీరితో పాటు పనిచేసే బావర్చీలకు (సహాయక వంటగాళ్లు) రోజుకు రూ. 3 వేల నుంచి రూ. 10 వేల వరకు కూలి లభిస్తోంది. కేవలం ఒక నెలలోనే వీరు ఏడాదికి సరిపడా ఆదాయాన్ని ఆర్జిస్తుండటం విశేషం.

**నిజాంల వారసత్వం.. పర్షియా నుంచి పాతబస్తీ దాకా..**

హైదరాబాదీ హలీంకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. దీని మూలాలు నిజాంల కాలం నాటివి. మొదట పర్షియా, యెమెన్ దేశాల నుంచి వచ్చి నిజాంల వద్ద పనిచేసిన వంటగాళ్లు ఈ సరికొత్త రుచులకు శ్రీకారం చుట్టారు.

**ఆరో నిజాం:**
మహబూబ్ అలీ ఖాన్ కాలంలో ఈ వంటకాలు షాహీ (రాజరిక) మెనూలో చేరాయి.

**ఏడో నిజాం:**
మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ హయాంలో ఇవి అత్యంత ప్రజాదరణ పొంది, సామాన్యుల దరికి చేరాయి.తర్వాతి కాలంలో దక్కనీ బావర్చీలు ఈ వంటకాల్లో తమదైన శైలిని జోడించి, 'హైదరాబాదీ హలీం'ను ప్రపంచ ప్రఖ్యాతం చేశారు.

**శిక్షణ లేదు.. అంతా అనుభవమే!**

ఈ వంటగాళ్లకు ప్రత్యేకంగా హోటల్ మేనేజ్మెంట్ కోర్సులు ఉండవు. అంతా గురుశిష్య పరంపరలోనే సాగుతుంది. ఉస్తాద్‌ల వద్ద ఏళ్ల తరబడి సహాయకులుగా పనిచేస్తూ, మసాలాల మోతాదు, మాంసం ఉడికే పద్ధతి (మెళకువలు) నేర్చుకుంటారు. అలా రాటుదేలిన వారే తర్వాతి కాలంలో బావర్చీలుగా, ఆపై ఉస్తాద్‌లుగా ఎదుగుతారు. నగరంలో ప్రస్తుతం సుమారు 10 వేల మందికి పైగా బావర్చీలు ఉన్నట్లు అంచనా.

**సీజన్ ముగిసినా.. ఆగని రుచుల ప్రయాణం**

రంజాన్ ముగియగానే వీరికి పని ఉండదని చాలామంది భావిస్తారు. కానీ, వాస్తవానికి వీరికి ఏడాదంతా ఉపాధి లభిస్తుంది. నగరంలోని ముస్లిం వివాహాలు, రిసెప్షన్లు, ఇతర శుభకార్యాల్లో హలీం, బిర్యానీ తప్పనిసరి. "రంజాన్ సమయంలో హలీం బాధ్యతలు చూసే వీరు, మిగిలిన రోజుల్లో హోటళ్లలో బిర్యానీలు, ఇతర వంటకాల తయారీలో నిమగ్నమవుతారు" అని పిస్తా హౌస్ అధినేత మహ్మద్ అబ్దుల్ మజీద్ తెలిపారు.

**అక్షరాలా రూ. 1000 కోట్ల వ్యాపారం!**
హలీం కేవలం రుచి మాత్రమే కాదు, నగర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోంది.

**టర్నోవర్:**
గతేడాది రూ. 800 కోట్లుగా ఉన్న వ్యాపారం, ఈసారి రూ. 1000 కోట్లు దాటుతుందని హోటళ్ల సంఘం అంచనా వేస్తోంది.

**విక్రయాలు:**
గత సీజన్‌లో 50 లక్షల ప్లేట్లు అమ్ముడవగా, ఈసారి అది 60 లక్షలకు చేరువయ్యే అవకాశం ఉంది.

**తయారీ:**
ప్రధాన కేంద్రాల్లో రోజుకు 25 వేల కిలోల హలీం తయారవుతోంది. అర్ధరాత్రి వేళ కూడా నగరం హలీం బట్టీల వద్ద కిటకిటలాడుతుండటం, హైదరాబాద్‌కే సొంతమైన ప్రత్యేక సంస్కృతికి అద్దం పడుతోంది.







## పిస్తా హౌస్.. ఒక ఎమోషన్

### సల్మాన్ ఖాన్.. షారుఖ్ ఖాన్ కు కూడా ఫేవరెట్




**మహా, బ్యూరో:**

హైదరాబాదీలకి 'పిస్తా హౌస్' అనేది కేవలం ఒక హోటల్ మాత్రమే కాదు, అది ఒక అద్భుతమైన రుచుల వారసత్వం. ఒక ఎమోషన్. 1997లో మహ్మద్ అబ్దుల్ మజీద్ ఆధ్వర్యంలో ఒక చిన్న బేకరీగా ప్రారంభమైన ఈ సంస్థ, నేడు ప్రపంచవ్యాప్తంగా తన రుచులను విస్తరించింది. పిస్తా హౌస్ హలీం కేవలం హైదరాబాద్‌లోనే కాదు, అమెరికా, గల్ఫ్ దేశాలకు కూడా ఎగుమతి అవుతుంది. సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్ వంటి బాలీవుడ్ సెలబ్రిటీలతో పాటు సానియా మీర్జా వంటి క్రీడాకారులు కూడా పిస్తా హౌస్ రుచులకు అభిమానులు.

**పిస్తా హౌస్ ప్రత్యేకతలు:**
**ప్రపంచ ప్రఖ్యాత హలీం :**
రంజాన్ మాసంలో పిస్తా హౌస్ హలీంకు ఉన్న క్రేజ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. 2010లో జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ పొందిన మొట్టమొదటి మాంసాహార వంటకం ఇదే. ప్రతి ఏటా టన్నుల కొద్దీ హలీం ఇక్కడ తయారవుతుంది.
**పసందైన బిర్యానీ:** ఇక్కడి మటన్ బిర్యానీ మరియు జఫ్రానీ చికెన్ బిర్యానీ భోజన ప్రియుల ఫేవరెట్.
**నగరంలోని కొన్ని ప్రధాన కేంద్రాలు:**
**పిస్తా హౌస్, టోలిచౌకి :** ఇది చాలా ప్రసిద్ధ బ్రాంచ్.
**రేటింగ్: 4.6**
**పిస్తా హౌస్, కింగ్ కోఠి : ఫ్యామిలీతో కలిసి వెళ్లడానికి ఇది ఉత్తమమైన ప్రదేశం.**
**రేటింగ్: 4.7**
**వినియోగదారుల అభిప్రాయాలు :**
**హలీం గురించి:**

"ఇక్కడి హలీంలో మాంసం చాలా మెత్తగా ఉడికి, జీడిపప్పులు మరియు నెయ్యి ఘుమఘుమలతో అద్భుతంగా ఉంటుంది. ప్రతి ముద్దలోనూ ఆ నాణ్యత తెలుస్తుంది."
**అంబియెన్స్:**
"టోలిచౌకి మరియు కింగ్ కోఠి బ్రాంచ్‌లలో వాతావరణం చాలా బాగుంటుంది. సర్వీస్ కూడా చాలా వేగంగా ఉంటుంది."
**మీకు తెలుసా?**
పిస్తా హౌస్ హలీం కేవలం హైదరాబాద్‌లోనే కాదు, అమెరికా, గల్ఫ్ దేశాలకు కూడా ఎగుమతి అవుతుంది.సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్ వంటి బాలీవుడ్ సెలబ్రిటీలతో పాటు సానియా మీర్జా వంటి క్రీడాకారులు కూడా పిస్తా హౌస్ రుచులకు అభిమానులు.

## హైదరాబాద్‌లో బెస్ట్ హలీం బ్రాండ్‌లు ఇవే...

మహా: హైదరాబాద్‌లో హలీం అంటే కేవలం ఒక వంటకం కాదు, అదొక ఎమోషన్. రంజాన్ మాసం వచ్చిందంటే చాలు నగరమంతా హలీం ఘుమఘుమలతో నిండిపోతుంది.

**సిటీలో కొన్ని ప్రధానమైన మరియు అత్యంత ఆదరణ పొందిన హలీం బ్రాండ్‌లు ఇవే..**

**పిస్తా హౌస్:**
హైదరాబాద్ హలీంకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ఘనత పిస్తా హౌస్‌దే. వీరు జియోగ్రాఫికల్ ఇండికేషన్ (GI) ట్యాగ్ పొందిన మొట్టమొదటి మాంసాహార బ్రాండ్‌గా నిలిచారు.

**షా ఘౌస్**
స్పైసీ మరియు మసాలా దట్టించిన హలీం ఇష్టపడే వారికి షా ఘౌస్ మొదటి ఎంపిక.
**ప్రత్యేకత:**
వీరి హలీం చాలా చిక్కగా, అధిక మొత్తంలో మటన్ మరియు నెయ్యితో నిండి ఉంటుంది. యువతలో దీనికి విపరీతమైన క్రేజ్ ఉంది.
**ప్రధాన కేంద్రాలు:**
టోలిచౌకి, గచ్చిబౌలి, లక్డీకాపూల్.

**కేఫ్ 555**
మాసాబ్ ట్యాంక్‌లోని ఈ కేఫ్ తన వెరైటీ హలీంలకు ప్రసిద్ధి.
**ప్రత్యేకత:**
ఇక్కడ లభించే 'స్పెషల్ హలీం'లో చికెన్ 65, ఉడికించిన గుడ్డు మరియు రోజ్ పెటల్స్ (గులాబీ రేకులు) వంటి టాపింగ్స్ ఉంటాయి.
**మస్ట్-ట్రై:** ఇరానీ మటన్ హలీం.

**సర్వీ రెస్టారెంట్**
బంజారా హిల్స్‌లోని సర్వీ హోటల్ తన క్లాసిక్ ఇరానీ హలీంకు పెట్టింది పేరు.
**ప్రత్యేకత:**
సున్నితమైన రుచి, సమతుల్యమైన మసాలాలు. హలీంతో పాటు ఇక్కడి ఫిర్నీ కూడా చాలా ప్రసిద్ధం.

**హోటల్ షాదాబ్**
పాతబస్తీలోని మదీనా సర్కిల్ వద్ద ఉండే షాదాబ్, సాంప్రదాయ రుచులకు నెలవు.
**ప్రత్యేకత:**
ఇక్కడి 'జబాన్ హలీం' (మేక నాలుకతో చేసినది) చాలా స్పెషల్. పాతబస్తీ సంస్కృతిని ప్రతిబింబించే రుచి ఇక్కడ దొరుకుతుంది.

**సుభాన్ బేకరీ**
ఉస్మానియా బిస్కెట్లకు పేరొందిన సుభాన్ బేకరీ, హలీం రంగంలోనూ తనదైన ముద్ర వేసింది.
**ప్రత్యేకత:**
సరైన మాంసం మరియు గోధుమల నిష్పత్తితో చేసే వీరి హలీం చాలా సాఫ్ట్‌గా ఉంటుంది. బాదం పప్పుల టాపింగ్‌తో ఇది మరింత రుచిగా ఉంటుంది.

**గ్రిల్-9**
సికింద్రాబాద్ కార్ఖానాలోని ఈ రెస్టారెంట్ గత కొన్ని సంవత్సరాలుగా హలీం ప్రేమికులను ఆకట్టుకుంటోంది.
**ప్రత్యేకత:**
వీరు హలీం పైన ఇచ్చే 'పత్తర్ కా గోష్త్' టాపింగ్ ఒక వినూత్నమైన ప్రయోగం మరియు చాలా మందికి ఇష్టమైన రుచి.

**కేఫ్ బహార్**
హిమాయత్ నగర్‌లోని కేఫ్ బహార్ దశాబ్దాలుగా తన నాణ్యతను కాపాడుకుంటూ వస్తోంది.
**ప్రత్యేకత:**
స్థిరమైన రుచి మరియు తక్కువ సమయంలోనే ఎక్కువ మందికి సర్వ్ చేసే విధానం ఇక్కడ ప్రత్యేకం.

ANN తెలుగు
# మహా పత్రిక
06
మంగళవారం, హైదరాబాద్ | 24-02-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM

# గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి: సిపిఐ

**గుడిసెల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి.. సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్..జిల్లా కలెక్టరేట్ ముందు 200 మందితో సిపిఐ ధర్నా**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల పట్టణంలోని సర్వే నెంబరు 75లో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో 2022 సంవత్సరంలో నివాస స్థలంలోని నిరుపేదలందరూ కలిసి సిపిఐ జెండా పట్టుకొని గుడిసెలు వేసుకున్నారు. నాలుగు సంవత్సరాలు అయినా నేటికీ పట్టాలు ఇవ్వలేదని వారందరికీ ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, వారు నివాసం ఉండే గుడిసెల కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శంకర్పల్లి మండల కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో 500 మందికి ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చారు. కానీ స్థలాలు నేటికీ చూపించలేదు. చేవెళ్లలో పట్టాలు ఇవ్వాలి, శంకర్పల్లిలో ఇండ్ల స్థలాలు చూపించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ చేవెళ్ల నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ నియోజకవర్గ ఇన్చార్జి కె రామస్వామి అధ్యక్షతన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకోవడం కాదు చిత్తశుద్ధి ఉంటే చేవెళ్ల పట్టణంలో పేదలు గుడిసెలు వేసుకొని నాలుగు సంవత్సరాలుగా ఇంటి స్థలం సర్టిఫికెట్ కోసం ఎదురుచూస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారందరికీ పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మోకిలాలోని పొన్నగుట్ట తండాలో గిరిజన రైతుల భూములను ల్యాండ్ పూలింగ్లో తీసుకున్న ప్రభుత్వం, వారికి కేటాయించాల్సిన 800 గజాల స్థలాన్ని ఇవ్వకుండా, వీరి పేరుతో ఉన్న భూమికి సంబంధం లేని వ్యక్తులకు, ఎంజాయ్మెంట్ సర్వేలో వారి పేర్లను చేర్చి ఒరిజినల్ గిరిజన రైతులకు అన్యాయం చేయడం తగదని, తక్షణమే ఒరిజినల్ రైతుల పేర్లను జాబితాలో చేర్చి ఎనిమిది వందల గజాల స్థలాన్ని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు, సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు ధర్నాలో మాట్లాడారు. పేదలకు న్యాయం జరిగే వరకు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభు లింగం, వడ్ల సత్యనారాయణ భాతరాజు, నరసింహ, సిపిఐ చేవెళ్ల మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల కార్యదర్శి కే శ్రీనివాస్, శంకర్ పల్లి మండల కార్యదర్శి పి సుధీర్, జిల్లా సమితి సభ్యులు మంజుల, సుధాకర్ గౌడ్, సక్రు నాయక్, గుడిసెలు వేసుకున్న నిరుపేదలు సుమారు 200 మంది ఈ ధర్నాలో పాల్గొన్నారు.

## శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం
# అత్యంత వేగంగా ఆర్థిక శక్తిగా ఎదిగింది

**రాజేంద్రనగర్, మహా ;** నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ లో హైదరాబాద్లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్ జి ఐ ఎ) గ్రీన్ఫీల్డ్ పి పి పి, విమానాశ్రయంగా ప్రారంభమై, భారతదేశంలో అత్యంత వేగంగా ఆర్థిక శక్తిగా ఎదిగింది. ఇది తెలంగాణ మరియు దేశానికి వృద్ధి, ఉపాధి, వాణిజ్యం, కనెక్టివిటీ, పెట్టుబడులను ప్రోత్సహిస్తోంది. ఆర్థిక అధ్యయనం 2024-25 ప్రకారం, (ఆర్ జి ఐ ఎ) సుమారు 68,000 కోట్ల గ్రాస్ వాల్యూ యాడెడ్ (జి వి ఎ) ను సృష్టిస్తోంది. ఇది తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో దాదాపు 4.6% ప్రభావాన్ని చూపిస్తోంది. ప్రత్యక్ష, పరోక్ష, ప్రేరిత ప్రభావాలతో కలిపి సుమారు 3.5 లక్షల ఉద్యోగాలకు మద్దతు ఇస్తోంది. విస్తరిస్తున్న జీఎంఆర్ ఏరోసిటీతో కలిపి చూసినప్పుడు, మొత్తం ఎకోసిస్టమ్ ప్రభావం



75,000 కోట్లు, దాదాపు 4.1 లక్షల ఉద్యోగాలు భారతదేశంలో విమానయాన ఆధారిత అభివృద్ధిలో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కీలక పాత్ర స్పష్టంగా చూపిస్తోందని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ లో తేలిందన్నారు.

## మహిళా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరించిన కమిషనర్ సుధీర్ బాబు
### వచ్చేనెల 7న అంతర్జాతీయ మహిళా దినోత్సవం
### మహిళా దినోత్సవానికి కలెక్టర్ను ఆహ్వానించిన డిఆర్ఓ సంగీత

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్ ను, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, డిఆర్ఒ శ్రీమతి సంగీత ఆవిష్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లాలోని మహిళా ఉద్యోగులకు మార్చి 4వ తేదీన హెల్త్ క్యాంప్ ను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఆటలు, క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడానికి, మహిళలకు ప్రత్యేక అనుమతి ఇప్పించాలని, మార్చి 7వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడానికి అనుమతినివ్వాలని, జిల్లా కలెక్టర్ సి



నారాయణ రెడ్డికి, డిఆర్ఓ ద్వారా వినతి పత్రాన్ని సమర్పించారని రంగారెడ్డి జిల్లా టిజీఓ అధ్యక్షులు డాక్టర్ కే రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంతిశ్రీ, రేవతి, అలివేలు, మహేశ్వరి, సైదమ్మ, బాలేశ్వరి, డా.నరేందర్, మసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి వేదిక ప్రజావాణి

**స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె శ్రీనివాస్.. జిల్లా ప్రజావాణికి 43 ఫిర్యాదులు**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 43 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల వినతి పత్రాలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని, వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమము కేవలం సమస్యలు విని దరఖాస్తులు స్వీకరించే విధంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలిచేలా ప్రతి ఒక్కరు పని చేయాలని, ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సమస్యలు పరిష్కరించే వేదికగా



మార్చాలని తెలిపారు. ఫిర్యాదులు సమర్పించడానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయం అందించడంలో అధికారులు సిబ్బంది చొరవ చూపాలని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ ఇవ్వాలి

**రెట్టింపు కార్డులు ఇస్తామని ఉన్నవాటిలో కోతలు.. జీవో 252ని సవరించాలి**

**రాజేంద్రనగర్ మహా ;** ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలి ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చే వరకు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ నియామక ప్రక్రియను నిలిపి వేయాలి. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తు ఉద్యమాలను ఉధృతం చేస్తాం జిల్లా రెవిన్యూ అధికారి సంగీత, డీపీఆర్వో బాలేశ్వరి కి వినతిపత్రలు అందజేత.టిడబ్ల్యూజెఎఫ్ రంగా రెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు సోమవారం ధర్నా నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు హాజరయ్యారు.రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేరిబాయి గణేష్, మైల సైదులు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, రెట్టింపు అక్రిడిటేషన్ కార్డులు ఇస్తామని చెప్పి నేడు ఉన్నవాటిలో కోతలు ఎందుకు విధిస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జర్నలిస్టులను ఉద్ధరిస్తున్నామని చెప్పుకుంటూ కొత్త జీవోలు తీసుకొచ్చి వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వకుండా కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫేక్ జర్నలిస్టులను ఏరి వేత పేరుతో వర్కింగ్ జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గం మున్సిపాలిటీ మండలలో పనిచేసే జర్నలిస్టులతో పాటు డెస్క్ లో పనిచేసే వారికి కూడా అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చి న్యాయం చేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టులకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. జీఓ 252 సవరించాకే అక్రిడిటేషన్ కమిటీని నియమించాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. గణేష్, యం. సైదులు జిల్లా కలెక్టర్, డీపీఆర్వో లను డిమాండ్




చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 252 వర్కింగ్ జర్నలిస్టులు నష్ట పోతున్నార న్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వకుండా కోతలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. పనిచేసే జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు తప్ప మరి ఏవి కూడా ప్రభుత్వం ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అక్రిడేషన్ కార్డులను సైతం ఇవ్వకుండా ఏండ్ల పాటు పనిచేస్తున్న జర్నలిస్టులను అవమానాల పాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఆర్ఓ, డీపీఆర్వో లకు వినతిపత్రం అందజేశారు.జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులను అందించాలని డిమాండ్ చేస్తూ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర శేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిలువేరు సురేష్, ఎండి కాజా పాషా, జిల్లా డెస్క్ జర్నలిస్ట్ లు సంఘం రాష్ట్ర నాయకులు అజయ్ కుమార్, రాజేందర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేష్, సుదర్శన్,ఎం శ్రీనివాస్, మణి, నర్సింహారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు క్రాంతి, అంజి, శ్రీశేలం, శ్రీనివాస్, శివ, నియోజకవర్గాల అధ్యక్ష కార్యదర్శులు పల్లటి జగన్, రాఘవేందర్ గౌడ్, శంకర్, సురేందర్, నర్సింహా, భూచన్న, భగవంతు, జర్నలిస్ట్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అడవి పశువుల బెడద నుంచి పంటలను కాపాడాలి

**గ్రామ మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** బండలేమురు గ్రామంలో అడవి పశువులు ఎక్కువై రైతుల పంట పొలాలను నాశనం చేస్తున్నాయని వాటిని అక్కడ నుండి తరలించాలని కోరుతూ సోమవారం రంగారెడ్డి జిల్లా ప్రజావాణిలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మంచాల మండలం, బండలేమూర్ మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ మాట్లాడుతూ... గ్రామ పరిసర ప్రాంతంలో పశువుల బెడద ఎక్కువైందని దీని కారణంగా పది సంవత్సరాలుగా రైతులు పంటలను పండించుకునే పరిస్థితి లేకుండా అయిందని అన్నారు. గ్రామంలోని అనేక మంది రైతులు తమ పంట పొలాల్లో పశువుల బెడదతో పంటలు వేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా పంటలు వేసుకోలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాత్రిపూట పశువుల బెడద నుండి పంటలను కాపాడుకోవడానికి రాత్రనకా పగలనకా కాపు కాసిన రక్షణ లేకుండా పోయిందని వాపోతూ, ప్రభుత్వ అధికారులు వీటిపై తగు చర్యలు తీసుకొని పంట పొలాలను కాపాడి, రైతులను ఆదుకోవాలని, గ్రామ మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ జిల్లా అధికారులను కోరారు.10 సంవత్సరాలుగా 100 పశువుల దాకా ఉన్నాయని వాటి వలన పంటలు వేసుకోలేకపోతున్నాము. తమ పొలాల్లో పంటలు వేయకుండా బీడులుగా మారి ప్రభుత్వము నుంచి వచ్చే రైతు భరోసా పథకం కూడా వర్తించడం లేదని అన్నారు. రైతు భరోసా అంద



కపోయినా కనీసం పంట పండించుకొని కూటగడుపుకుందామన్న పరిస్థితి లేకుండా పోయింది. అట్టి పశువులను ఇక్కడి నుండి తరలించాలని పలుమార్లు ప్రభుత్వ అధికారులకు విన్నవించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. గత పది సంవత్సరాలుగా పంటలను పశువులతోటి కాపాడుకోలేక పోయాము ఇప్పుడు యాసింగులో కొద్దిపాటి వరి నాట్లను వేసుకోవడం జరిగింది. వేసిన కొద్ది రోజుల్లో నే అట్టి వరిచేలను వెంటనే పశువులు మేసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కావున ఇప్పటికైనా అక్కడి పశువులను ఇక్కడినుండి తరలించి గోషాలకా ఇతర ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నాము. ఒకవేళ ప్రభుత్వ అధికారులు తరలించని యెడల రైతులు తరలించుకోవడానికి అనుమతి అయినా ఇస్తే వాటిని మేమే తరలిస్తామని అందుకు పర్మిషన్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బండలేమూర్ మాజీ వార్డ్ మెంబర్ జాపాల శంకర్ పాల్గొన్నారు.

# సర్కారీ బడిలో కలెక్టర్ 'లెక్కల' పాఠం..

- విద్యార్థులతో కలిసి బెంచీపై కూర్చుని ముచ్చటించిన చంద్రశేఖర్..
- బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతీక్ పాఠశాల ఆకస్మిక తనిఖీ..
- ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం..

**నల్గొండ మహా :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేటు సంస్థలకు మించిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ స్పష్టం చేశారు. సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని బొట్టుగూడలో ఉన్న కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నేరుగా తొమ్మిదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో కలిసి కాసేపు సందడి చేశారు. బ్లాక్ బోర్డు వద్ద నిలబడి విద్యార్థులకు స్వయంగా గణిత పాఠాలను బోధించారు. గణితంలో క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థం చేసుకునే మెళకువలను నేర్పించి విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి ఉత్సాహాన్ని నింపారు.విద్యార్థుల అవగాహన స్థాయిని తెలుసుకునేందుకు కలెక్టర్ పలు ప్రశ్నలు వేయగా వారు



చకచకా సమాధానాలు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని ముఖ్యంగా గణితం లాంటి సబ్జెక్టులపై పట్టు సాధించాలంటే నిత్యం సాధన (ప్రాక్టీస్) చేయాలని సూచించారు. పాఠశాలలోని తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల పరిస్థితి, విద్యుత్ సౌకర్యాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని పాఠశాల నిర్వహణలో అలసత్వం వహించవద్దని అధికారులను ఆదేశించారు. సర్కారీ బడుల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉపాధ్యాయులు అంకితభావంతో బోధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) భిక్షపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# 15 రోజుల్లోగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు పూర్తి కావాలి

**కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం మాన్యం చల్క ఆసుపత్రి భవన తనిఖీ..**

**నల్గొండ టౌన్ మహా :** నల్గొండ జిల్లా కేంద్రంలోని మాన్యం చల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి 15 రోజుల్లోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి జైలు సమీపంలో నిర్మితమవుతున్న ఆసుపత్రి భవనాన్ని ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.భవన నిర్మాణ పురోగతిని, అంచనా వ్యయం మరియు స్థల వివరాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ద్వారా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భవనాన్ని సంపూర్ణంగా పూర్తి చేయడానికి మరికొంత బడ్జెట్ అవసరమని డీఎంహెచ్ఓ ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి సైతం నిధుల అవశ్యకతను కలెక్టర్కు వివరించారు. ప్రస్తుతం పాత భవనంలో ఉన్న వైద్య పరికరాలనే ఇక్కడ కూడా వినియోగిస్తామని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ భవనం



లోని అన్ని విభాగాలను నిశితంగా పరిశీలించారు. ప్రధానంగా:వైద్యుల గదులు, రోగుల వెయిటింగ్ హాల్,ల్యాబ్, స్టోర్ రూమ్ మరియు వార్డుల సౌకర్యం, ర్యాంప్, టాయిలెట్లు మరియు నీటి సరఫరా వ్యవస్థలను పై వసతులన్నీ సమకూర్చుకుని పక్షం రోజుల్లో ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ నేత నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, యూపీహెచ్సీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# కర్ల రాజేష్ మృతిపై నిష్పక్షపాత విచారణ జరపాలి..

- ఎస్పీ శరత్ చంద్రను కోరిన మందకృష్ణ మాదిగ..
- బాధ్యులైన ఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండ్..

**నల్గొండ మహా :** కోదాడ పట్టణం గాంధీనగర్కు చెందిన దళిత యువకుడు కర్ల రాజేష్ అనుమానాస్పద మృతి (లాకప్ డెత్) కేసులో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈ కేసు విచారణాధికారిగా నియమితులైన నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ను సోమవారం ఆయన కార్యాలయంలో మందకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసు తాలూకు పూర్వాపరాలను బాధితుడి కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని ఎస్పీకి క్షుణ్ణంగా వివరించారు.అనంతరం మందకృష్ణ మాదిగ విలేకరులతో మాట్లాడుతూ.. రాజేష్ మృతికి కారణమైన చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డిని వెంటనే సర్వీసు నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. పోలీసు కస్టడీలో ఉన్న యువకుడు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ స్థాయి అధికారి ఈ కేసును



పర్యవేక్షించడం సానుకూల అంశమని బాధితులకు త్వరగా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు మేడి శంకర్ మాదిగ, మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న మాదిగ, బకరం శ్రీనివాస్ మాదిగ గట్టు మల్లయ్య మాదిగ పాల్గొన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ నల్గొండ నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జ దేవయ్య మాదిగ, జిల్లా కార్యదర్శి తరి ఏడుకొండలు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఐతవోని జనార్దన్ గౌడ్, ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఏర్పుల శ్రవణ్ కుమార్ తదితరులు ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

# సత్య మార్గంలో నడవడమే సేవాలాల్కు నిజమైన నివాళి..

- మూఢనమ్మకాలను వీడి అభ్యున్నతి పథంలో సాగాలి..
- బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు
- నల్గొండలో ఘనంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగం పాల్గొన్న కలెక్టర్, మేయర్

**నల్గొండ మహా :** నీతి నిజాయితీ ధర్మం వంటి సత్య మార్గాలను బోధించిన సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజంలో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ చౌరస్తాలో సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. "లంబాడా, గిరిజన తెగల్లో పేరుకుపోయిన మూఢనమ్మకాలను పారద్రోలి వారిని చైతన్యవంతులను చేసేందుకు సేవాలాల్ మహారాజ్ విశేష కృషి చేశారని ఆయన చూపిన బాటలోనే నేడు ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. రాజ్యాంగబద్ధమైన హక్కులు, ప్రభుత్వ పథకాలు అట్టడుగు వర్గాలకు అందేలా చూడటమే ఆయనకు మనం ఇచ్చే గొప్ప గౌరవం" అని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో ఈ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

**ఆధ్యాత్మిక గురువు,సేవా మూర్తి..**

నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ కేవలం ఒక తెగకు పరిమితం కాదని, ఆయన లోక కళ్యాణం కోసం కృషి చేసిన ఆధ్యాత్మిక గురువని కొనియాడారు. సత్సంగ్ ద్వారా సమాజంలో ధర్మం, సమభావన పెంపొందించేందుకు ఆయన చేసిన బోధనలు నేటికీ ఆచరణీయ



మని చెప్పారు. సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో నడవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. గిరిజన సంస్కృతిని కాపాడుకుంటూనే, విద్యా మరియు ఆర్థిక రంగాల్లో రాణించడమే మహానుభావుడికి మనం ఇచ్చే గౌరవమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ, తహసిల్దార్ పరశురాం, కార్పొరేటర్లు దీప్లా నాయక్, నాగార్జున, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డైట్ 'స్టాఫ్ ట్యూటర్' పోస్టులో నల్గొండ 'డిఈఓ' ద్వంద్వ నీతి..

- నాడు వద్దని, నేడు ముద్దని ఒక్క ఉద్యోగానికి రెండు రకాల నిబంధనలు..
- డిఈఓ వింత వైఖరి ఒకే పోస్టు ఒక్కో టీచర్కు ఒక్కోరూలు...
- విస్మయం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ లోకం..
- అక్రమ బదిలీని రద్దు చేయాలని కలెక్టర్కు జీటీఏ సంఘం విన్నపం..

**నల్గొండ మహా బ్యూరో:** జిల్లా విద్యాశాఖలో నిబంధనలు గాలికి వదిలేసి ఒకే పోస్టుకు ఒకరికి ఒక నీతి, మరొకరికి మరో నీతి అన్నట్లుగా జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. నల్గొండలోని ప్రభుత్వ డైట్ (DIET) కళాశాలలోని ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ సెంటర్ (ELTC)లో స్టాఫ్ ట్యూటర్ నియామకంలో జరిగిన అక్రమాలను ఎండగడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (GTA) జిల్లా శాఖ నేతలు సోమవారం జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. నకిరేకల్ మండలం ఓగోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ను నిబంధనలకు విరుద్ధంగా డైట్ కళాశాలకు బదిలీ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. నిజానికి డైట్ కళాశాలలోని స్టాఫ్ ట్యూటర్ పోస్టు మల్టీ జోన్ పరిధిలోకి వస్తుంది. దీనిని భర్తీ చేసేందుకు కేవలం ప్రభుత్వ మేనేజ్మెంట్కు చెందిన ఉపాధ్యాయులు మాత్రమే అర్హులు. అంతేకాకుండా ఈ పోస్టును నింపడానికి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నుంచి స్పష్టమైన ఉత్తర్వులు ఉండాలి. కానీ ఎటువంటి అధికార పరిధి లేకపోయినా నల్గొండ డీఈఓ నేరుగా జిల్లా పరిషత్ యాజమాన్య ఉపాధ్యాయుడిని ప్రభుత్వ పోస్టులోకి బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేయడం విడ్డూరంగా ఉందని జీటీఏ నేతలు మండిపడ్డారు. ఇది సర్వీస్ రూల్స్ను పూర్తిగా కాలరాయడమేనని వారు స్పష్టం చేశారు.

**నాడు వద్దని.. నేడు ముద్దని!**

గతంలో ఇదే పోస్టు భర్తీ విషయమై ఒక జెడ్పీ టీచర్ హైకోర్టును ఆశ్రయించిన సందర్భంలో ఉమ్మడి సీనియారిటీ లేనందున జెడ్పీ టీచర్లు ఈ పోస్టుకు అనర్హులని ఇదే డీఈఓ స్వయంగా కోర్టుకు కౌంటర్ అఫిడవిట్ సమర్పించారు. రాష్ట్ర విద్యాశాఖ కూడా యాజమాన్యాల వారీగానే బదిలీలు నిర్వహిస్తామని కోర్టుకు తెలిపింది. ప్రస్తుతం టీచర్ల బదిలీలపై నిషేధం ఉన్నప్పటికీ, హైకోర్టులో కోర్టు ధిక్కార కేసు (CC No: 1401/2003) పెండింగ్లో ఉన్నా కూడా తన పాత అఫిడవిట్ను మర్చిపోయి మరీ డీఈఓ ఈ నియామకానికి వత్తాసు పలకడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ఉపాధ్యాయ లోకం ప్రశ్నిస్తోంది.

**కలెక్టర్ విచారణకు డిమాండ్..**

సర్వీస్ రూల్స్కు విరుద్ధంగా జారీ చేసిన ఈ బదిలీ ఉత్తర్వులపై (Pro.Rc No: B1/4957/ELTC/2019) సమగ్ర విచారణ జరిపించాలని జీటీఏ జిల్లా అధ్యక్షుడు కనల సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పాతెపురం సైదయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.స్వామి డిమాండ్ చేశారు. నిబంధనలను అతిక్రమించి ప్రభుత్వ మేనేజ్మెంట్ టీచర్లకు అన్యాయం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# తండ్రి కోరిక వల్ల సినిమాల్లోకి..
# ఒక్క మూవీతో నేషనల్ క్రష్‌గా!

టాలెంట్ ఉంటే సరిపోదు, ఆవగింజంత అదృష్టం కూడా ఉండాలి. కొందరికి ఫస్ట్ సినిమాతోనే విపరీతమైన పాపులారిటీ వస్తుంది. మరికొందరికి ఏళ్లు గడిచాక గుర్తింపు దక్కుతుంది. హీరోయిన్ తృప్తి డిమ్రి రెండో కోవకు చెందుతుంది. నేడు (ఫిబ్రవరి 23న) ఈ బ్యూటీ బర్త్‌డే. ఈ సందర్భంగా ఆమె గురించి కొన్ని ఆసక్తికర విషయాలు తెలుసుకుందాం..

## అనుకోకుండా సినిమాల్లోకి..

హీరోయిన్ తృప్తి డిమ్రి ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్‌లో 1995 ఫిబ్రవరి 23న జన్మించింది. తండ్రి దినేష్ డిమ్రి ఎయిరిండియా ఉద్యోగి. తల్లి గృహిణి. తృప్తి అనుకోకుండా సినిమాల్లోకి వచ్చింది. ఆమె సోదరుడి స్నేహితుడు ఫోటోగ్రాఫర్. ఒకరోజు ఈమె ఫోటోలు తీసి ఢిల్లీలోని ఇమేజెస్ బజార్‌కు పంపించాడు. ఆ ఫోటోలు వారికి నచ్చడంతో ఫోటోషూట్‌కు పిలిపించారు. అలా తృప్తి జర్నీ మొదలైంది.

## తండ్రి కోరిక నెరవేర్చేందుకు...

మొదట్లో యూట్యూబ్ ఛానల్‌లో పని చేసింది. అక్కడే కెమెరాకు అలవాటు పడటం నేర్చుకుంది. నిజానికి తృప్తి తండ్రికి యాక్టర్ అవ్వాలని కోరికట.. దీంతో తండ్రి కోరికను తాను నెరవేర్చాలనుకుంది. బుల్లితెరపై అయినా నటిస్తే చాలనుకుని మొదట్లో మోడలింగ్ చేసింది. అక్కడ మంచి పేరు రావడంతో నటి అవ్వాలన్న ఆశతో ముంబైలో అడుగుపెట్టింది. అయితే నటిని అవుతా అని ఇంట్లో చెప్పగానే కుటుంబసభ్యులు కొంచెం కంగారుపడ్డారట.

## అవకాశాలు లేనప్పుడు..

పైగా బంధువులు కూడా.. ఆమె ఇండస్ట్రీకి వెళ్తే చెడు అలవాట్లకు బానిసవుతుంది. ఆమెను ఎవరూ పెళ్లి చేసుకోరు అని భయపెట్టారు. అయినా ఇంట్లో వాళ్ల ప్రోత్సాహంతో ముందడుగు వేసింది. ఇండస్ట్రీలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంది. అవకాశాలు రాని సమయంలో బాధపడింది. కానీ, వెనకడుగు మాత్రం వేయలేదు. అలా మామ్ సినిమాలో చిన్న పాత్రలో కనిపించినప్పటికీ 2017లో పోస్టర్ బాయ్స్ సినిమాతో కథానాయికగా పరిచయమైంది. ఆ మరుసటి ఏడాది వచ్చిన లైలా మజ్నులోని లైలా పాత్రలో ప్రేక్షకులకు దగ్గరైంది.

## యూత్ క్రష్

2020లో వచ్చిన హారర్ మూవీ బుల్బుల్‌తో ఓటీటీ స్టార్‌గా మారింది. ఆ మూవీ తర్వాత తన దశ తిరిగిపోయింది. 2023లో వచ్చిన సందీప్‌రెడ్డి వంగా యానిమల్ సినిమాతో నేషనల్ వైడ్ గుర్తింపు తెచ్చుకుంది. యూత్ అందరికీ క్రష్‌గా మారిపోయింది. బ్లాక్‌బస్టర్ మూవీ భూల్ భులయ్యా 3లో ద్విపాత్రాభినయం చేసింది. ప్రస్తుతం హిందీలో మా బెహెన్, తెలుగులో ప్రభాస్ సరసన స్పిరిట్ సినిమా చేస్తోంది. తెలుగులో ఇదే తన తొలి సినిమా కావడం విశేషం!





# ఓటీటీకి అవార్డ్ విన్నింగ్ సినిమా..
# స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

హాలీవుడ్ నటుడు లియోనార్డో డికాప్రియో ప్రధాన పాత్రలో వచ్చిన పొలిటికల్ థ్రిల్లర్ 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్'. ఈ చిత్రం తాజాగా బాఫ్టా అవార్డుల్లో సత్తా చాటింది. ఏకంగా ఆరు విభాగాల్లో అవార్డులు కొల్లగొట్టింది. గతేడాది సెప్టెంబర్ 26న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి పాల్ థామస్ ఆండర్సన్ దర్శకత్వం వహించారు. తాజాగా ఈ చిత్రం ఓటీటీకి వచ్చేందుకు సిద్ధమైంది. ఈనెల 26 నుంచి జియో హాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని జియో హాట్‌స్టార్ అఫీషియల్‌గా ప్రకటించింది. ఈ మూవీ గతంలో గోల్డెన్ గ్లోబ్స్ అవార్డ్స్‌లోనూ సత్తా చాటింది. అంతేకాకుండా ఈ ఏడాది జరగనున్న ఆస్కార్ అవార్డులకు వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ 13 విభాగాల్లో నామినేషన్స్ సాధించింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే వంటి కీలక విభాగాలలో నామినేట్ అయింది.

# రాధిక శరత్‌కుమార్ తాయ్ కిజవి..



సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న తాజా చిత్రం తాయ్ కిజవి. ఈ మూవీలో ఇంతకు ముందెన్నడు కనిపించని లుక్‌లో రాధికా కనిపించనుంది. ఈ సినిమాకు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రాన్ని హీరో శివ కార్తికేయన్ నిర్మించారు. ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్ వృద్ధురాలిగా కనిపించనున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం ఫిబ్రవరి 27న థియేటర్లలో సందడి చేయనుంది. అయితే ప్రస్తుతానికి కేవలం తమిళంలోనే రిలీజ్ కానుంది. తెలుగులోకి డబ్ చేసి రిలీజ్ చేసే విషయంపై మేకర్స్ క్లారిటీ ఇవ్వలేదు. ఈ చిత్రంలో సింగమ్ పులి, అరుళ్ దాస్, బాల శరవణన్, తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# నా టాలెంట్‌కు ఫిదా అవుతారనుకుంటే కుమ్మేశారు

కాలేజీ డేస్‌లో చాలామంది ప్రేమలో పడతారు. కొందరిది వన్‌సైడ్ లవ్ అయితే మరికొందరిది టూసైడ్ లవ్. అలా బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ కూడా కాలేజీలో చదువుకునే రోజుల్లో ఓ అమ్మాయిని చూసి మనసు పారేసుకున్నాడట! ఈ విషయాన్ని 'ద వీల్ ఆఫ్ ఫార్చ్యూన్' షోలో వెల్లడించాడు. తాజాగా ఈ షోలోని లేటెస్ట్ ఎపిసోడ్‌లో ఈ ఆసక్తికర విషయాన్ని బయటపెట్టాడు.

**అమ్మాయి ఇంటి ముందు**

తన కాలేజీ డేస్‌లోని లవ్ స్టోరీని గుర్తు చేసుకున్నాడు. 'ఇది 40 ఏళ్ల కిందట ముచ్చట. అప్పుడు నేను కాలేజీకి వెళ్తున్నాను. ఒక అమ్మాయిని చూసి ముచ్చటపడ్డాను. తనకోసం ప్రత్యేకంగా ఒక పాట నేర్చుకున్నాను. నా ఫ్రెండ్ ఒకరికి గిటార్ వాయించడం తెలుసు. కాబట్టి వాడిని వెంటేసుకుని నేరుగా అమ్మాయి ఇంటి ముందు నిలబడ్డాను.

**తన్నులు తిన్నాం**

అతడు గిటార్ వాయిస్తుంటే నేను పాట పాడటం మొదలుపెట్టాను. నా పాట విని అమ్మాయి వస్తుందనుకుంటే చుట్టుపక్కలవాళ్లు వచ్చి మమ్మల్ని చితక్కొట్టారు. వారి చేతిలో చచ్చామనుకున్నాం. ఎవరినో ఇంప్రెస్ చేద్దామని వెళ్లి మేమే తన్నులు తిని వచ్చాం' అని గుర్తు చేసుకున్నాడు.

**పర్సనల్ లైఫ్**

కాగా సినిమాల్లో స్టార్ హీరోగా క్రేజ్ తెచ్చుకున్న అక్షయ్ ఫిలింఫేర్ మ్యాగజైన్ ఫోటోషూట్‌లో హీరోయిన్ ట్వింకిల్ ఖన్నాను కలిశాడు. అలా వాళ్లిద్దరి మధ్య పరిచయం తర్వాత ప్రేమకు దారితీసింది. 2001లో అక్షయ్, ట్వింకిల్ పెళ్లి చేసుకున్నారు. వీరికి 2002లో కుమారుడు ఆరవ్ జన్మించాడు. 2012లో కూతురు నితారా పుట్టింది.



# ఆగిపోయిన సినిమాలు..
## తినడానికి తిండి లేక టీవీ...: నటుడు



**ఒకప్పుడు తినడానికి తిండి లేక ఎన్నో కష్టాలు చూశానంటున్నాడు బాలీవుడ్ నటుడు ఆమిర్ అలీ. ఎఫ్ఐఆర్ అనే టీవీ సీరియల్ ద్వారా బుల్లితెరపై గుర్తింపు తెచ్చుకున్న అతడు నాలుగైదు హిందీ సినిమాల్లోనూ తళుక్కుమని మెరిశాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కెరీర్‌లో ఎదుర్కొన్న ఇబ్బందులను ఏకరువు పెట్టాడు.**

**నా పని అయిపోయిందనుకున్నా**

అతడు మాట్లాడుతూ.. నేను టీవీలో ఫస్ట్ సీరియల్ చేసినప్పుడు అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఎందుకంటే నాకు బుల్లితెరపై కనిపించాలని లేదు. టీవీలో కనిపిస్తే సినిమా యాక్టర్‌గా నా పనైపోయినట్లేనని నా అభిప్రాయం. టీవీ ఇండస్ట్రీలో అడుగుపెట్టే సమయానికే కొన్ని సినిమాలు చేశాను.. కానీ, అవి రిలీజ్ కాకుండానే ఆగిపోయాయి. దాంతో నాకివ్వాల్సిన డబ్బులు కూడా పూర్తిగా రాలేవు.

**చేతిలో చిల్లిగవ్వ లేక..**

ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాను. తినడానికి తిండి లేక, ఫుడ్ కొనుక్కోవడానికి సరిగా డబ్బు కూడా ఉండేది కాదు. ఇంటి బాధ్యత మొత్తం నాపైనే ఉంది. అప్పటికే నేను రెండు మూడు సినిమాలు చేయడంతో ఇక్కడ కెరీర్ సెట్టయిందన్న భావనతో ఉన్న ఉద్యోగం కూడా వదిలేశాను. చివరకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో అయిష్టంగా టీవీ ఇండస్ట్రీకి వెళ్లాల్సి వచ్చింది.

**సీరియల్స్ ఎందుకు అనగానే..**

అప్పుడు ప్రతిరోజు నేను నా వ్యాన్‌లో కూర్చుని ఏడ్చేవాడిని. నాతో సినిమాలు చేసినవారందరూ ఎందుకు సీరియల్స్ చేస్తున్నావని అడగ్గానే దుఃఖం తన్నుకొచ్చేది. అరగంటపాటు ఆపకుండా ఏడ్చేవాడిని. 2019లో చాలామంది దర్శకనిర్మాతలను కలిశాను. నువ్వు హీరోవి, నిన్ను సైడ్ క్యారెక్టర్స్‌లో ఎలా చూస్తారు?

**ఇప్పటికీ ఇబ్బందులే..**

ఒకవేళ అలాంటి పాత్ర ఏదైనా ఉంటే చెప్తాం అంటూ మాట దాటేసేవారు. 2017లో టీవీ ఇండస్ట్రీని వదిలేసినప్పటికీ నాపై బుల్లితెర నటుడు అనే ముద్ర అలాగే ఉండిపోయింది. అంత ఈజీగా నాకెవరూ అవకాశాలివ్వరు అని ఆమిర్ అలీ చెప్పుకొచ్చాడు. ఆమిర్ అలీ.. ఐ హేట్ లవ్ స్టోరీస్, ఫరాజ్ వంటి చిత్రాల్లో నటించాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com